క్లుప్తంగా

రోడ్లపై గుంతల పూడ్చివేత



జేసీబీతో గుంతలను పూడ్చి వేస్తున్న దృశ్యం

యాలాల: లక్ష్మీనారాయణపూర్ నుంచి యాలాల మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన దారిలో ఏర్పడిన గుంతలను సోమవారం పూడ్చివేశారు. జక్కేపల్లి సమీపంలోని ఆర్‌బీఎల్ ఫ్యాక్టరీ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో ఈ ప్రక్రియ చేపట్టారు. లక్ష్మీనారాయణపూర్ నుంచి యాలాల వరకు ఏర్పడిన గుంతలను జేసీబీతో మొరం వేసి గుంతలను పూడ్చారు. ప్రధాన దారిలో ఏర్పడిన గుంతలను పూడ్చటంతో వాహనదారులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విశ్వకర్మ జయంతి

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఖాంజాపూర్ గుట్ట వద్ద మంగళవారం శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తాండూరు నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ(విశ్వకర్మ) సంఘం ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం పంచామృత స్నానం, తదితర పూజలతో పాటు అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని తెలిపారు. దీనికి విశ్వకర్మ సంఘం సభ్యులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

ప్రత్యేక పూజలు

కుల్కచర్ల: విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలో శ్రీ విశ్వకర్మ భగవాన్ ప్రత్యేకపూజలు నిర్వహిస్తారని నిర్వాహకులు పతాంజలి రమేషాచార్యులు, విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం నాయకులు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు. ఉత్సవాలలో భాగంగా అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

దోపిడీకి వ్యతిరేకంగా సాయుధ పోరు

సీపీఐ డివిజన్ కార్యదర్శి పీర్‌మహ్మద్



సాయుధ పోరాట వారోత్సవాల్లో సీపీఐ నాయకులు

పరిగి: భూమి కోసం, భుక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందని సీపీఐ డివిజన్ కార్యదర్శి పీర్‌మహ్మద్ పేర్కొన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఫ్యూడల్ అణచివేత దోపిడీలకు వ్యతిరేకంగా జరిగిందన్నారు. కమ్యూనిస్టులు, పేద ప్రజలు వీరోచితంగా పోరాటం చేయడంతో భూస్వాములు హైదరాబాద్ వంటి మహా నగరాలకు పారిపోయారన్నారు. వీరోచిత పోరాటం వల్ల నిజాం ప్రభుత్వం పూర్తిగా బలహీన పడిపోయిందన్నారు. హైదరాబాద్ సంస్థానాన్ని కమ్యూనిస్టులు ఆక్రమిస్తారని ఆనాటి నెహ్రూ ప్రభుత్వం నిజాంతో ఒప్పందం చేసి సంస్థానాన్ని భారతదేశంలో వీలీనం చేశారన్నారు. ఆనాటి నుంచి భూస్వాములు పేదల నుంచి తిరిగి భూములను స్వాధీనం చేసుకున్నారన్నారు.

నేడు ప్రజాపాలన దినోత్సవం

తాండూరు రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఎంపీడీఓ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. అధికారులందరూ హాజరు కావాలని ఆదేశించారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



దుకాణం వద్ద విరాళం సేకరిస్తున్న కళాకారులు

బొంరాస్‌పేట: ఇటీవల వర్షాలతో దెబ్బతిన్న ఖమ్మం వరద బాధితులకు తెలంగాణ నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా కమిటీ విరాళాలు సేకరిస్తూ ఔదార్యాన్ని చాటుకుంటుంది. సోమవారం మండల పరిధిలోని రేగడిమైలారం తదితర గ్రామాలు, గిరిజన తండాల్లో ఆసంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ఊరూరా జానపద ఆటపాటలతో ప్రదర్శనలు చేసి విరాళాల సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం నియోజకవర్గం కొడంగల్ నుంచి ఊరూరా విరాళాలు సేకరిస్తూ దయనీయ పరిస్థితుల్లో ఉన్న ఖమ్మం వరద బాధితుల కోసం తమవంతు సాయంగా వికారాబాద్ జిల్లా నుంచి సంఘం పక్షాన విరాళాలు సేకరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాజశేఖర్, పెంటప్ప, శ్రీనివాస్, అనిత, రేణుక, మమత ఉన్నారు.

ట్రాఫిక్ సమస్య.. తీరేదెన్నడో?

- పెద్దేముల్‌లో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలని వినతి



పెద్దేముల్‌లో ప్రధాన రహదారిపై నిలిచిన వాహనాలు

పెద్దేముల్: ఇరుకు రోడ్డుతో మండలవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇష్టం వచ్చినట్లు రోడ్లపై వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ సమస్య పెరిగి ప్రయాణికులు, విద్యార్థులకు ఆటంకంగా మారింది. వారాంతపు సంతతో ట్రాఫిక్ సమస్య అధికమవుతుంది. దీంతో కనీసం పాఠశాల సమయంలోనైన ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తాండూరు-సంగారెడ్డి ప్రధాన రహదారి మండల కేంద్రంలో సుమారు కిలో మీటరు వరకు ఉంటుంది. డివైడర్ ఉన్నా రోడ్డు వెడల్పు లేక పోవడంతో తరచూ వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో నాగులపల్లి, మారేపల్లి, పెద్దేముల్, రుద్రారం, బుద్దారం, గాజీపూర్‌తో పాటు పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీ పాఠశాలతో పాటు వివిధ బడులకు దాదాపు 600 మంది విద్యార్థులు నిత్యం వస్తుంటారు. ఉదయం పాఠశాల ప్రారంభం, సాయంత్రం వదిలే సమయాల్లో ట్రాఫిక్‌తో విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు.

వినతులకే పరిమితం

మండల కేంద్రంలో కనీసం మంగళవారం జరిగే వారాంతపు సంత రోజైన ట్రాఫిక్ పోలీసును ఏర్పాటు చేయాలని స్థానికులు పోలీస్ ఉన్నతాధికారులను నాలుగేళ్లుగా కోరుతున్నారు. కానీ ఆ దిశగా నేటికీ అడుగులు పడలేదు. నిత్యం తాండూరు నుంచి సంగారెడ్డి, వికారాబాద్, జహీరాబాద్, పటాన్ చెరుతో పాటు హైవే రోడ్డుకు లింక్ ఉండటంతో వేల సంఖ్యల్లో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ పోలీసును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సంత రోజు నియమించాలి



కనీసం వారాంతపు సంత రోజైన ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలి. రోడ్డు ఇరుకుగా ఉండటంతో చిన్న వ్యాపారస్తులు రోడ్డు పక్కన పండ్లు, చెప్పుల దుకాణాలు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

– వీరప్ప, మాజీ సర్పంచ్, గాజీపూర్

రోడ్డుపై నిలుపుదల



విద్యార్థులు ఇంటికి వెళ్లే సమయంలో ట్రాఫిక్ పోలీసులను నియమించాలి. వారాంతపు సంతలో రోడ్ల పక్కన దుకాణాల యజమానులు ఇష్టం వచ్చినట్లు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుంది.

– బంద్యప్ప, ఇందూరు, పెద్దేముల్

చర్యలు తీసుకుంటాం



రోడ్లపై వాహనాలు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం. ఈ విషయాన్ని గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వాహనాల యజమానులకు సూచనలు అందజేస్తాం. రోడ్డుపై ఇష్టం వచ్చినట్లు వాహనాలు నిలిపితే చర్యలు తప్పవు.

– గిరి, ఎస్‌ఐ, పెద్దేముల్

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



తాండూరులో ర్యాలీ చేపట్టిన ముస్లింలు

తాండూరు/కొడంగల్/బంట్వారం: మిలాద్ ఉన్ నబీ వేడుకలు జిల్లా వ్యాప్తంగా అట్టహాసంగా జరిగాయి. సోమవారం ముస్లింల ఆరాధ్య దైవమైన మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ఉత్సవాలు నిర్వహించారు. ముస్లిం కమిటీల ఆధ్వర్యంలో ఆయా పట్టణాల్లో పుర వీధుల గుండా ముస్లింలు ఊరేగింపు చేపట్టారు.



కొడంగల్: ప్రభుత్వాస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న ముస్లిం పెద్దలు



బంట్వారం: కోట్‌పల్లి మసీద్ వద్ద ముస్లింలు

‘టెండర్ వేసినా పిలవలేదు’

అనంతగిరి: వికారాబాద్‌లో జరుగుతున్న వినాయక నిమజ్జన ఏర్పాట్ల పనులకు సంబంధించి టెండర్లు వేయించారని కాంట్రాక్టర్ స్రవంతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తి చేయకుండానే మరొకరికి నామినేట్ చేస్తూ పనులను అప్పగించడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. అధికారులు టెండర్లు వేసిన వారిలో ఒకరికి అప్పగిస్తే బాగుండేదని, టెండర్ వేయని వారికి పనులు అప్పగించి తమను అవమాన పర్చడం భావ్యం కాదని వాపోయారు.

‘ప్రజాపాలన’కు సన్నద్ధం

బొంరాస్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రత్యేకంగా సెప్టెంబరు 17ను ‘ప్రజాపాలన’ దినోత్సవంగా నిర్వహించనుంది. ఇందుకుగాను సోమవారం కార్యాలయాల శుద్ధి, జాతీయ జెండా ఏర్పాట్లను చేశారు. మండలంలోని మూడుమామిళ్లతండాలో గ్రామ పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మంగళవారం జాతీయజెండా ఆవిష్కరణ నిర్వహించనున్నారు.

నిమజ్జనానికి సర్వం సిద్ధం

- మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్
- నేడు వికారాబాద్‌లో వినాయక సామూహిక నిమజ్జనం



చెరువు కట్టపై పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో మంగళవారం జరిగే సామూహిక వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ తెలిపారు. శోభాయాత్ర జరిగే రూట్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్లపై పడిన గుంతలను పూడ్చి వేయించామన్నారు. నిమజ్జన ఏర్పాట్లలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో పాల్గొంటారన్నారు. వినాయకులను ఎబ్బనూర్ చెరువులో నిమజ్జనం పూర్తి చేసే వరకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. చెరువు వద్ద రెండు క్రేన్లు, ఒక జేసీబీ అందుబాటులో ఉంటుందని, వాటి ద్వారా వినాయకుల నిమజ్జనం చేయిస్తామన్నారు. చెరువు వద్ద బారికేడ్లు, విద్యుత్ దీపాలతో పాటు పలువురు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామని తెలిపారు.

పటిష్ట బందోబస్తు

వినాయక నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు. భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో శోభాయాత్ర నిర్వహించాలని సూచించారు. నిర్ణీత సమయానికి శోభాయాత్ర ప్రధాన రోడ్లపైకి వచ్చేలా చేసి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తామని హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు మాధవరెడ్డి పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం

పాఠశాలకు తలుపులు, కుర్చీల అందజేత

సాక్షి ఎఫెక్ట్..



పాఠశాలకు డోర్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

దుద్యాల్: తాము చదువుకున్న పాఠశాల బాగు కోసం పూర్వ విద్యార్థులు నడుం బిగించారు. మండలంలోని హస్నాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాల 1985–86 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థులు తరగతి గదులకు తలుపులు, కుర్చీలను సోమవారం అందించి ఆదర్శంగా నిలిచారు. ఇటీవల ఏర్పాటు చేసుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయం మేరకు అందరూ కలిసి రూ.20 వేలు పోగు చేసి దాతృత్వ కార్యక్రమం చేపట్టారు. గతంలో పాఠశాల ప్రాంగణంలో మందు బాబులు వీరంగం సృష్టించారు. మద్యం తాగి బాటిళ్లను తరగతి గదులు, వరండాల్లో పగలగొట్టారు. దీనిపై ‘సాక్షి’ వరుస కథనాలు ప్రచురించింది. ఈ సమస్యను ప్రధానోపాధ్యాయుడు పూర్వ విద్యార్థుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాలకృష్ణరెడ్డి, ఉస్మాన్, సులేమాన్, కృష్ణ, శేఖర్, వీరేశం, గిరిజ, సునీత, రజిని, విజయలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న నాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు

కుల్కచర్ల: చిన్నప్పుడు కలిసిమెలసి చదువుకున్న స్నేహితులందరూ ఒక్క చోటికి చేరుకొని మధురానుభూతులను నెమరేసుకున్నారు. బాల్యంలో తాము చేసిన చిలిపి చేష్టలను పంచుకుంటూ ఆనందంగా గడిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కుల్కచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల(బాలుర)కు చెందిన 2006–07 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు క్రమశిక్షణ నేర్పి ఉత్తములుగా తీర్చిదిద్దిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు వెంకటేష్‌రెడ్డి, లక్ష్మణ్, రవీందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆంజనేయులు, సాయిలు, పూర్వ విద్యార్థులు సురేశ్‌రెడ్డి, యాదయ్య, లక్ష్మణ్, పాండు, నరేశ్, రాజశేఖర్, తిరుపతి, విశ్వేంద్రచారి, శివరాములు, కేశవులు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: వికారాబాద్‌లో వినాయకుడి పూజలో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



ధారూరు: వికారాబాద్‌లో గణనాథుడి వద్ద మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



దుద్యాల్: హస్నాబాద్‌లో అన్నప్రసాదం వడ్డిస్తున్న నటుడు ప్రభాకర్

ఏకదంతుడికి.. ప్రత్యేక పూజలు

తొమ్మిది రోజులుగా పూజలందుకుంటున్న పార్వతీపుత్ర తనయుడైన వినాయకుడిని గంగమ్మ చెంతకు చేర్చేందుకు భక్తులు వైభవంగా ఏర్పాట్లు చేశారు. మేళాతాళాలు, వాయిద్యాల నడుమ నిమజ్జన శోభాయాత్ర శోభాయమానంగా సాగింది. పలు చోట్ల మహిళల సాంస్కృతిక ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో సోమవారం నిమజ్జన, ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు.

– సాక్షి, నెట్‌వర్క్



పూడూరు: సోమన్‌గుర్తిలో నిమజ్జనోత్సవం



దుద్యాల్‌లో వినాయక ఊరేగింపులో యువకుల సందడి



దోమ: నిమజ్జనానికి గణనాథున్ని తీసుకెళ్తున్న గ్రామస్తులు



దుద్యాల్: హస్నాబాద్ పెద్ద చెరువులో గంగమ్మ ఒడిలోకి చేరుతున్న గణనాథుడు



ధారూరు: మోమిన్‌కలాన్‌లో అన్నదానం



కుల్కచర్ల: ఇప్పాయిపల్లిలో భజన చేస్తున్న భక్తులు



కొడంగల్: కలాల్‌వాడలో అన్నప్రసాద వితరణలో మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్



పూడూరు: మేడిపల్లి కలాన్‌లో లడ్డూ కైవసం చేసుకున్న భక్తుడు



దుద్యాల్: నిమజ్జనంలో యువకుల ఉత్సాహం